క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న నాయకులు

కౌటాల: మండలంలోని గుడ్లబోరి, ముత్తంపేట్, కౌటాల, కుంబారి, సైదాపూర్ గ్రామాల్లో మంగళవారం బాధితులకు బీజేపీ మండల అధ్యక్షుడు కుంచాల విజయ్ ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆపదలో ఉన్న పేదవారికి ప్రభుత్వం సాయం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిగౌడ్, మహేశ్, జితేందర్, కాళిదాస్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి



మహిళలతో మాట్లాడుతున్న ధన్‌రాజ్

కెరమెరి: బ్యాంకులు, స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఐకేపీ సీసీ ధన్‌రాజ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉదానగర్‌లో మహిళా సంఘాల మహిళలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రుణాలు తీసుకున్న వారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట వీవోఏ రఘునాథ్ ఉన్నారు.

నానో యూరియాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏవో

కాగజ్‌నగర్‌టౌన్: అధిక యూరియా వాడకంతో భూసారం కోల్పోతుందని ఏవో రామకృష్ణ అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్ మండలంలోని వంజిరి, నందిగూడ గ్రామాల్లో రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పించారు. ఏవో మాట్లాడుతూ రైతులు అధిక యూరియా వాడకంతో భూసారం తగ్గి పంట దిగుబడి తగ్గే ప్రమాదముందన్నారు. రైతులు నానో యూరియా వాడకంతో అధిక దిగుబడితో పాటు లాభం చేకూరుతుందన్నారు. రైతులు పంట మార్పిడి పద్ధతిని కొనసాగించాలని సూచించారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

కెరమెరి: వేతనాలు చెల్లించాలని పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సిబ్బందికి సీఐటీయూ మండల కోకన్వీనర్ అనిల్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ గడిచిన మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ కష్టమవుతుందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి వేతనాలు విడుదల చేయాలని కోరారు. నాయకులు సంతోష్, కార్మికులు భజంగ్‌రావు, విజయ్, స్వామి, నగేశ్, భీంరావు తదితరులు ఉన్నారు.

'వృద్ధుడిని ఆదుకోండి'



కాలికి గాయంతో నిస్సహాయ స్థితిలో అంకులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పొట్టి శ్రీరాములు చౌక్ ప్రాంతానికి చెందిన వృద్ధుడు అంకులు స్థానిక అంకమరాజుల ఆలయం వద్ద ఆశ్రయం పొందుతున్నాడు. గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడే జీవనం కొనసాగిస్తుండగా, ఇటీవల కాలికి గాయమైంది. సరైన వైద్యం చేయించుకోలేక గాయం తీవ్రమై, నడవలేని స్థితికి చేరాడు. ఇలాంటి పరిస్థితిలో తిండి లేక అవస్థ పడుతున్నాడు. అధికారులు, స్వచ్ఛంద సంస్థలు స్పందించి అభాగ్యుడిని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతే లక్ష్యం!

- పల్లెల్లో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలు ప్రారంభం
- అక్టోబర్ 2 వరకు నిర్వహణ



కెరమెరిలో నాలాలు శుభ్రం చేస్తున్న కార్మికులు



పార్కులో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

కెరమెరి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలు చేపడుతున్నారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఆదేశాల మేరకు ఈ నెల 23 నుంచి అక్టోబర్ 2 వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఆయా కార్యక్రమాలను గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వీటిల్లో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొంటున్నారు.

గ్రామ పంచాయతీ స్థాయిలో..

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటిలో ఒక్కో గ్రామ పంచాయతీలో 100 మందితో శ్రమదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పర్యావరణం, పండుగలపై యువత, మహిళా సంఘాలతో చర్చా వేదికలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులతో మానవ హారం, ప్రతిజ్ఞ, ర్యాలీలు చేపట్టనున్నారు. స్వచ్ఛతా మిత్రులను గుర్తించి వారికి సన్మానాలు చేయనున్నారు. చెత్త నుంచి వస్తువులను వేరు చేయడం, వ్యర్థాల నిర్వహణ, పంచాయతీ ఆస్తుల మరమ్మతులు వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు గ్రామాల్లోని ప్రజలకు, యువతకు అవగాహన కల్పించనున్నారు.

పల్లెల్లో చేపట్టే కార్యక్రమాలు..

- ఈనెల 23న మంగళవారం ఇంటింటికీ వెళ్లి పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు.
- 24న గ్రామాల్లో నిలిచి ఉన్న మురికి నీటిని తొలగించడంతో పాటు కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణం చేపడుతారు.
- 25న దేశవ్యాప్తంగా శ్రమదాన కార్యక్రమంలో భాగంగా ఒక రోజు ఒక గంట అందరూ శ్రమదానంలో పాల్గొనాలి.
- 26న గ్రామ పరిసరాల్లో, చెత్త పేరుకుపోయిన ప్రదేశాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- 27న సంస్కృతిక కార్యక్రమాలు, పారిశుద్ధ్యంపై ఇంటింటి ప్రచారం, అవగాహన కార్యక్రమాలు చేపడుతారు.
- 28న ప్లాస్టిక్ వాడకంపై అవగాహన, దుకాణం యజమానులతో సమావేశం, పర్యావరణ మితమైన వస్తువులు, మహిళా ఆరోగ్యం, హోటళ్లకు స్వచ్ఛతా నోటీసులు జారీ చేయడం, స్టీల్ గ్లాసులు, ప్లేట్ల వాడకంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- 30న మండల కేంద్రాలు, సబ్ సెంటర్లలో పారిశుద్ధ్య సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు, మందులు పంపిణీ చేపడుతారు.
- అక్టోబర్ 1న గ్రామాల్లో పారిశుద్ధ్య ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తారు.
- 2న గ్రామ సభల ఏర్పాటు, మహాత్మా గాంధీ జయంతి, స్వచ్ఛ భారత్ దినోత్సవం, బహుమతులు ప్రదానోత్సవం, పారిశుద్ధ్య సిబ్బందికి సన్మానం, బీమా పత్రాలు, పీపీఈ కిట్ పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు.

పకడ్బందీగా నిర్వహిస్తున్నాం..



గ్రామ పంచాయతీ స్థాయిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ప్రతీ రోజు వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. గ్రామాలను స్వచ్ఛతగా తీర్చిదిద్దడంతో పాటు అనేక అంశాలపై గ్రామీణులకు అవగాహన కల్పించి వారిని అభివృద్ధి బాటలో నడిపించేందుకు ఈ కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడుతాయి.

– ఎండీ అంజద్‌పాషా, ఎంపీడీవో

రోడ్డుపై గుంతలు పూడ్చరూ!



గుంతలమయంగా దహెగాం –లగ్గాం రోడ్డు

దహెగాం: ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామీణ ప్రాంత రోడ్లు గుంతలమయంగా మారాయి. గుంతలు పూడ్చేవారే లేరా.. అంటూ ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రం నుంచి లగ్గాం, పెంచికల్‌పేట్ మండలానికి నిత్యం వందల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై గుంతలు పడ్డ చోట మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డంతా రోజురోజుకు మరింత అధ్వానంగా మారిపోతుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి దహెగాం –లగ్గాం రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఆరోగ్యానికి పోషకాహారం తీసుకోవాలి



చేడ్వాయిలో సీమంతం నిర్వహిస్తున్న సిబ్బంది



గోయగాంలో..

పెంచికల్‌పేట్: పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. మండలంలోని చేడ్వాయి గ్రామంలో మంగళవారం నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మహిళలు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు ప్రతీరోజు తీసుకునే ఆహారంలో పోషకాహారం ఉండేలా జాగ్రత్త పడాలన్నారు. పోషకాహార లోపం వలన కలిగే అనర్థాలను వివరించారు. ఈసందర్భంగా మహిళలకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

కెరమెరి: చక్కటి పోషక విలువలు గల ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ ఏసీడీపీవో ఉమాఫాతిమ అన్నారు. మంగళవారం పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని గోయగాం సెక్టార్ పరిధిలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం చేశారు. పోషణ అభియాన్ అధికారి తౌఫిక్, సూపర్‌వైజర్లు లత, కుమారి, అంగన్‌వాడీలు లింగుబాయి, మంజుల, శకుంతల, సుజాత, శ్యామల తదితరులు ఉన్నారు.

డ్రైవర్లు, క్లీనర్లకు లాభాల వాటా చెల్లించాలి



మాట్లాడుతున్న రీజియన్ అధ్యక్షుడు ఉపేందర్

రెబ్బెన: సింగరేణి యాజమాన్యం ప్రకటించిన లాభాల్లో నుంచి అర్హులైన లారీ డ్రైవర్లు, క్లీనర్లకు సైతం వాటా చెల్లించాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లు, క్లీనర్లతో కలిసి జీఎం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం మూలంగా అర్హులైన చాలా మందికి లాభాల్లో వాటా దక్కలేదన్నారు. దాంతో కార్మికులు ఆర్థికంగా నష్టపోవాల్సి వచ్చిందన్నారు. ఈసారి సింగరేణి కాలరీస్ లారీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు లచ్చన్న, కార్యదర్శి తిరుపతి, నాయకులు నర్సయ్య, శంకర్, మనోహర్, రవి, గంగారాం, సతీశ్, చంద్రకాంత్, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



ఆత్రం స్వప్న



ఎం.అంజలి



కే. సిద్ధార్థ్‌రాజ్



ఎం. సహస్ర



వరుణ్



నిఖిల్

రెబ్బెన: జాతీయస్థాయి సీనియర్, సబ్ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని గోలేటికి చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికైనట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోషియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. తిరుపతి తెలిపారు. సీనియర్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర పురుషుల జట్టుకు కే. సిద్ధార్థ్‌రాజ్, మహిళల జట్టుకు ఏ. స్వప్న, కే. అంజలిలు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర మహిళా జట్టు కెప్టెన్‌గా స్వప్న వ్యవహరించినున్నట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయి సబ్ జూనియర్ పోటీలకు బాలుర జట్టుకు సీహెచ్ వరుణ్, సీహెచ్ నిఖిల్, బాలికల జట్టుకు ఎం.సహస్ర ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 24 నుంచి 28 వరకు తమిళనాడు దిండిగల్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొంటారన్నారు.

తుమ్మిడిహెట్టి రోడ్డుకు మరమ్మతులు చేయాలి



రోడ్డుపై ఆందోళన చేస్తున్న నాయకులు

కౌటాల: కౌటాల –తుమ్మిడిహెట్టి రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని మంగళవారం సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప వర్గీయులు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ రోడ్డు గుంతలమయంగా మారడంతో ఈ మార్గంలో వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్డు అధ్వానంగా మారి నెలలు గడుస్తున్నా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రోడ్డుకు మరమ్మతులు చేయకుండా ఈ మార్గంలో నడిచే ఆర్టీసీ బస్సు సేవలను వేరే మార్గంలోకి మార్చారన్నారు. బస్సు సేవలు లేక మొగడ్‌దగడ్, వీర్దండి, భాలేపల్లి, తాటినగర్ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అక్టోబర్ 5వ తేదీలోగా రోడ్డుకు మరమ్మతులు చేయకపోతే తామే శ్రమదానం చేస్తామని పేర్కొన్నారు. సహకార సంఘం చైర్మన్ కుమురం మాంతయ్య, నాయకులు భీమయ్య, తిరుపతి, మనీశ్, బాపు, మానిశ్, రవీందర్‌గౌడ్, సంతోష్, బాజీరావు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

లాభాల వాటా పంపిణీలో అన్యాయం



నల్లబ్యాడ్జీలు అతికిస్తున్న శ్రీనివాస్‌రావు

రెబ్బెన: సింగరేణి సంస్థ 2024 –25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన లాభాల్లో నుంచి కార్మికులకు చెల్లించే వాటా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు అన్యాయం చేసిందని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్ రావు అన్నారు. సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాల్లో నుంచి కార్మికులకు 34 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బెల్లంపల్లి ఏరియాలోని గనులు, డిపార్టుమెంట్లలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 4034 కోట్లను పక్కన పెట్టి కేవలం రూ. 2360 కోట్లలో నుంచి 34 శాతం పంపిణీ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో పిట్ కార్యదర్శి వెంకటేశ్, మెరుగు రమేశ్, శ్రీనివాస్, ఏరియా నాయకురాలు వరలక్ష్మి, ఆఫీస్ ఇన్‌చార్జి మహేందర్, సెంట్రల్ నాయకులు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఎస్పీఎం'లో స్థానికులకు అవకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్/ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు సిర్పూరు పేపరు మిల్లులో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గెడం టీకానంద్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాకేంద్రంతో పాటు కాగజ్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రోజురోజుకు నిరుద్యోగం పెరిగిపోతుందని, పరిశ్రమలు లేక ఇతర జిల్లాలకు వెళ్లి పని చేయాల్సి వస్తుందని, జిల్లాలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మిల్లులో కార్మికులను ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి అధిక వేతనాలు ఇచ్చి స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా యాజమాన్యం మొండివైఖరి అవలంభిస్తుందన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్, ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం, నికిల్, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, సతీశ్, తిరుపతి పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో సీటు.. విద్యార్థినికి కలెక్టర్ సన్మానం



సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: ఉస్మానియా మెడికల్ కళాశాలలో సీటు సాధించిన విద్యార్థిని అవంతిని మంగళవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌటాల మండలంలోని గురుడుపేట గ్రామానికి చెందిన బూర్ల సంతోష్, కల్యాణి దంపతుల కూతురు అవంతి నీట్ పరీక్షలో ఆల్ ఇండియా దివ్యాంగుల కేటగిరిలో 2371 ర్యాంకు సాధించి ఉస్మానియా మెడికల్ కళాశాలలో సీటు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీపీవో మహేశ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పంట వివరాలు నమోదు చేసుకోవాలి

బెజ్జూర్: రైతులు సాగు చేస్తున్న వానాకాలం పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని ఏఈవో మీన ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు బెజ్జూర్ రైతు వేదిక వద్ద నిర్వహించే కార్యక్రమంలో బెజ్జూర్ శివారులోని రైతులు, అధికారుల వద్ద పంట వివరాలను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సమయానికి హాజరై పంట నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు.

దుర్గమ్మా.. సల్లంగా చూడమ్మా



కెరమెరిలో మంగళహారతులిస్తున్న భక్తులు

కెరమెరి: మండల కేంద్రంలోని కాలనీల్లో ప్రతిష్టించిన దుర్గాదేవి మండపాల వద్ద మంగళవారం భక్తులు పూజలు నిర్వహించారు. కొన్ని చోట్ల అన్నదానాలు జరిపారు. అర్చకుడు కులకర్ణి బాపూదేవ్ పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు.

ప్రభుత్వాస్పత్రి ఎదుట ఆమరణ నిరాహారదీక్ష

నార్నూర్: మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వాస్పత్రి ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో పార్టీ మండల అధ్యక్షుడు బిక్షపతి రాథోడ్ మంగళవారం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి ప్రారంభించి మూడేళ్లవుతున్నా సదుపాయాలు లేవన్నారు. వైద్యులు, సిబ్బంది కొరతతో వైద్యం కోసం వచ్చేవారు ఉట్నూర్ ఆస్పత్రి, ఆదిలాబాద్ రిమ్స్‌కు వెళ్తున్నారని తెలిపారు. ఆస్పత్రిలో పూర్తిస్థాయి సమస్యలు పరిష్కారంతోపాటు వైద్యులు, సిబ్బందిని నియమించే వరకు ఈ దీక్ష కొనసాగిస్తానని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ ప్రభాకర్, ఎస్సై అఖిల్, సిబ్బంది అక్కడికి చేరుకుని ఆయనకు నచ్చజెప్పారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని చెప్పినా వినలేదు. పోలీసుల బలవంతంగా దీక్ష భగ్నం చేసి నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు దీక్ష శిబిరాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం సందర్శించి మద్దతు తెలిపారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రకాశ్, నాయకులు దేవదాస్, రాజు, శ్రీకాంత్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ

నార్నూర్: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే ప్రజలు, రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చూడాలని సూపరింటెండెంట్ ఉపేందర్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రోగులకు వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. వైద్యులు జితేందర్‌రెడ్డి, హెచ్ఈ తులసిదాస్ రాథోడ్ తదితరులు ఉన్నారు.

నీటి తిప్పలు




నెత్తిపై నీటిబిందెతో వెళ్తున్న గ్రామస్తులు

నార్నూర్: గాదిగూడ మండలం కొటాల గ్రామంలో మొత్తం 13 ఆదివాసీ గిరిజన కుటుంబాలు గత 50 ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. గ్రామానికి వెళ్లడానికి రోడ్డు సౌకర్యం లేదు. వర్షాకాలంలో వారి బాధలు వర్ణణాతీతం. గ్రామస్తులు ఏ కాలమైన నీటి కోసం ఇక్కట్లు పడుతున్నారు. బిందెడు నీటి కోసం కిలోమీటర్ నడిచి వెళ్లాల్సిన పరిస్థితి. భారీ వర్షంలో సైతం వెళ్లాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు నిధులు లేవని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నీటి ట్యాంకు ఏర్పాటు చేయాలని వారి దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకపోయిందని, మిషన్ భగీరథ నీళ్లు గ్రామానికి అసలే రావని గ్రామపటేల్ కుడ్మెత అమృతరావు, కుడ్మెత గంగారాం, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కుమ్ర భీంరావు ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్తే నిధులు లేవు. నేను ఏం చేయాలని అని సమాధానం చెబుతున్నారని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

మేఘం గీసిన చిత్రాలు..!



పైన కారుమబ్బులు.. కింద వరద పరవళ్లు




ఆకాశంలో గుడి గోపురంలా..



మెరుస్తున్న ఆకాశం

చింతలమానెపల్లి: ఆకాశంలో కారుమబ్బులు కమ్మి కుండపోత వర్షం కురిసేటప్పుడు, వర్షం కురిసిన అనంతరం మబ్బులు తెరలుగా విడిపోతున్నప్పుడు ఆకాశం మబ్బులతో ప్రత్యేకంగా కనిపిస్తోంది. జిల్లాలోని కాగజ్‌నగర్ సమీపంలోని పెద్దవాగుపై గల రైల్వే వంతెన వద్ద కారుమబ్బులు కమ్మినప్పుడు, రెబ్బెన సమీపంలో మబ్బులు పరుగులు పెడుతున్నప్పుడు, చింతలమానెపల్లి మండలం డబ్బా సమీపంలో ఆకాశంలో మబ్బులు గుడి గోపురంలా మారినప్పుడు, కౌటాల మండల కేంద్రంలో రంగులతో గీసినట్టు మబ్బులు రూపం దాల్చినప్పటి దృశ్యాలను 'సాక్షి' కెమెరాలో బంధించింది. కాగా మేఘం గీసిన దృశ్యాలు ఎంతో ఆకర్షణీయంగా కన్పిస్తున్నాయి.



జడివానకు సిద్ధంగా మేఘాలు